## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్

జహీరాబాద్, అక్టోబర్ 20: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా కన్వీనర్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు సి.బాల్‌రాజుకు ఎమ్మెల్యే మాణిక్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం జహీరాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్‌ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, టెలికం బోర్డుసభ్యులు పవార్ శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేత బాల్‌రాజుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్

## బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

**ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు**

**పార్టీలో చేరిన అల్లాదుర్గం మాజీ జడ్పీటీసీ దంపతులు,**

**రేగోడ్ మండల కాంగ్రెస్-బీజేపీ నాయకులు**

**కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి**



అందోల్ : బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, నియోజకర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఫారూఖ్‌హుస్సేన్, పార్టీలో చేరిన అల్లాదుర్గం, రేగోడ్ మండలాల నాయకులు

అందోల్, అక్టోబర్ 20: కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్రంలో హ్యాట్రిక్ కొట్టేది బీఆర్‌ఎస్ పార్టే, సీఎం అయ్యేది కేసీఆర్ సారేనని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో అల్లాదుర్గం మండలం మాజీ జడ్పీటీసీ దంపతులు కంచరి మమతాబ్రహ్మం, రేగోడ్, అల్లాదుర్గం మండలాల బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి మంత్రి హరీశ్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమం గురించి ఆలోచించేది సీఎం కేసీఆర్ ఒక్కరేనని, అందుకే ప్రజలకు ఆయనపై అపారమైన ప్రేమ ఉన్నదన్నారు. జరుగనున్న ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రచారం చేపట్టాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం చేస్తారని, వారితో జాగ్రత్తగా ఉండేలా ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. అందోల్ గడ్డపై భారీ మెజార్టీతో గులాబీ జెండా ఎగురవేయాలని, అందుకోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఫారూఖ్‌హుస్సేన్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మెదక్ జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు సాయిలు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్‌గౌడ్, బీసీ సంఘం అధ్యక్షుడు శేఖర్, నాయకులు మహేశ్‌గౌడ్, పవన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధిని చూసి.. ఆశీర్వదించండి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



పటాన్‌చెరు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 20: అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయ్యాలని ఓటర్లను కోరారు. పటాన్‌చెరు పట్టణం పదేండ్ల క్రితం ఎలా ఉంది.? ఇప్పుడెలా ఉంది అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పటాన్‌చెరు పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని కొనియాడారు. అభివృద్ధిలో పటాన్‌చెరు టాప్‌లో ఉందని పేర్కొన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా మీరు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో తప్పకుండా గెలుస్తానన్నారు. మీకు సేవ చేసేందుకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. పటాన్‌చెరు పట్టణంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. 2014 వరకు పటాన్‌చెరు పట్టణం అధ్వానమైన మౌలిక వసతులతో కనిపించేదన్నారు. ఇప్పుడు పటాన్‌చెరు అభివృద్ధిలో నగరానికి దీటుగా ముందున్నదన్నారు. పదేండ్ల తరువాత వచ్చిన వారు పటాన్‌చెరు అభివృద్ధిని చూసి పోల్చుకోలేకపోతున్నారన్నారు. కాలుష్య జలాల స్థానంలో సురక్షితమైన మిషన్ భగీరథ నీటిని ఇస్తున్నామన్నారు. ప్రతి కాలనీకి సీసీ రోడ్లు వేశామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించామన్నారు. 24గంటలు కరెంట్ ఇస్తున్నామన్నారు. రాత్రివేళ స్ట్రీట్ లైట్లు వెలుగులు ఇస్తున్నాయన్నారు. పార్కులు ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మించామన్నారు. కేజీ టు పీజీ వరకు పటాన్‌చెరులో ఉచితంగా చదవచ్చున్నారు. కంపెనీల రాకతో ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ పట్టణాధ్యక్షుడు అఫ్జల్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, గూడెం కల్పనామధుసూదన్‌రెడ్డి, కంకర శ్రీను, వెంకటేశ్, గుండమల్ల రాజు, నవీన్‌రెడ్డి, మంగలి వినోద్, మాధవి, కొండల్, ధనరాజ్‌గౌడ్, శ్యామ్, అరుంధతి తదితరులున్నారు.



ఎన్నికల ప్రచారంలో యువతితో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాటాముచ్చట..

## కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోకండి

- తొమ్మిదిన్నరేండ్లలో ప్రజా సంక్షేమానికి కృషి చేసిన పార్టీ బీఆర్‌ఎస్
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సిర్గాపూర్: చీమల్‌పాడ్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, అక్టోబర్ 20: నియోజకవర్గం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధి కోసం తొమ్మిదిన్నరేండ్ల పాటు నిరంతరం కృషి చేశానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగం, చీమల్‌పాడ్, గౌడ్‌గాం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు భూపాల్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు ఆయా ఆలయాల్లో, భవానీ మండపాల్లో ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 60 ఏండ్లల్లో ఏ నాయకుడు చేయలేని అభివృద్ధిని సీఎం కేసీఆర్ సారథ్యంలో చేయగలిగామని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేశామన్నారు. ఎన్నికలు రాగానే కొందరు నాయకులు మాయమాటలు చెప్పి మభ్యపెట్టేందుకు చూస్తారని, వారి కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, మీ కోసం నిరంతరం కృషి చేసే తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కిషన్‌నాయక్‌తండా సమీపంలో మండల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఎమ్మెల్యే వారికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రయాగ మాధవరావు, పీఏసీఎస్ చైర్మన్ గుండు వెంకట్‌రాములు, పార్టీ మండలాధ్యక్షుడు సంజీవరావు, ఎంపీటీసీ శాంతాబాయి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్‌నాయకులు పాల్గొన్నారు.



సంగమేశ్వర స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## మీ ఊరి బిడ్డను.. ఆదరించండి

**ఝరాసంగం ప్రచారంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు**

ఝరాసంగం, అక్టోబర్ 20: మీ ఊరి బిడ్డను, మీకు సేవ చేసేందుకు వచ్చానని, శాసనసభ ఎన్నికల్లో ఓట్లు వేసి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రచారం చేశారు. శుక్రవారం ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరాలయం, చర్చి, దర్గాల్లో పూజలు చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారం ప్రారంభించారు. ఝరాసంగంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయాలని కోరారు. మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. అంతకుముందు కేతకీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్‌ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, జడ్పీటీసీ వినీలా నరేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశంతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు చేసిన ఎమ్మెల్యే, జహీరాబాద్ అభ్యర్థి మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్